# ‘హోటల్లో’

## ‘త్రిపుర’

ఉదయం ఎనిమిది. పైన చితచితగా వాన. లోపల తడి.

“మా పాప్ ఇలాంటి వేషాలు వేస్తే పాతేస్తానని రాశాడురా. బుద్ధి లేదు.”

“ముసలాళ్ళందరూ అంతేరా. ఈ ఓల్డ్ హేగ్స్‌ని హిట్లర్ జ్యూస్‌ని మెసకర్ చేసినట్లు ఫైరింగ్ స్క్వాడ్ ముందు పెట్టి టకటకమని షూట్ చేసి పారేయాలి.”

ముందు ఖాళీ కప్పులు, పెదిమల చివర్ల సిగరెట్లు.

* * *

“ధర్మాబమ్స్ చదివేరా?”

“పోనిద్దురూ. ఈ బీట్‌నిక్స్, మరీ రూట్‌లెస్ ఫెలోస్, ఏంగ్రీ యంగ్‌మెన్ నయమనిపిస్తూంది.”

కప్పుల్లో చల్లారుతున్న కాఫీ.

* * *

“యదవ నాయాల. పది రూపాయలిస్తేగాని ఫైలు



ముట్టుకోడానికీలు లేదన్నాడు. మళ్ళీ చూస్తే కుర్రకుంక. ఆ యదవ మొగాన్ని ఆ పది కొట్టి, సంతకమెట్టించుగొచ్చా. ఏం జేస్తాం. సస్తామా."

"ఈ కాలం యదవలంతా ఇంతేనయ్యా. డబ్బు చేతిలో అడయ్యందే పనిసెయ్యరు."

టేబుల్ మీద ఖాళీ చేసిన ఇడ్లీ ప్లేట్లు. మొదటాయన జేబులో చుట్ట కోసం తడుముడు.

*　　*　　*

ఒక మూల, దిబ్బగా, టొమాటోలాగ ఎర్రటి ముఖం కుర్రాడు నాలుగిడ్లీల ప్లేటు తింటు న్నాడు అటూ ఇటూ చూడకుండా.

*　　*　　*

"సరోజినమ్మగారు రెండు రవ్వ దోసెలు పొట్లాం కట్టించుకు రమ్మన్నారండి. ఆళ్ళబ్బాయి ఇటొచ్చినప్పుడు డబ్బులంపిస్తారంట."

"రెండు రవ దోశా పార్సెల్..." నంబుదిరి కేక.

*　　*　　*

"ఏమిటోయ్ హనుమంతూ, ప్రమోషన్ వచ్చిన తర్వాత పార్టీ ఇవ్వకపోవడమే కాకుండా ఒక్కడివి అలా బాంబర్ లాగ కూచుని మేసేస్తు న్నావ్!"

కుర్చీ బరబర వెనక్కి లాగి, పారల్లాంటి పళ్ళు విశాలంగా విప్పి, గుర్రంలాగ సకిలింపు నవ్వు నవ్వేడు వెంకట్రావ్. గతుక్కుమన్న హను మంతరావ్ – ఉల్లి దోసెలోని అడపా దడపా దంతాల మధ్యపడే వుల్లి ముక్కల్ని ఒక్కడూ సావకాశంగా అనుభవిస్తున్న హనుమంతరావ్ – 'ఈ వెధవ ఎప్పుడూ ఇంతే' అనుకుంటూ, పులికోరల్లాంటి తన పళ్ళు కూడా విప్పి –

"రావోయ్, ఏమిటి శాశ్వతం. ఏదీ ఇప్పుడే"



'త్రిపుర'గా ప్రసిద్ధి చెందిన ప్రసిద్ధ కథా రచయిత రాయసం వెంకట త్రిపురాంతకేశ్వరరావు 1928 సెప్టెంబర్ 2న ఒరిస్సాలో జన్మించారు. ఆయన హైస్కూల్ విద్య విశాఖపట్నంలో కొన సాగినప్పటికీ తదుపరి విద్యాభ్యాసమంతా ఇతర రాష్ట్రాలలోనే జరిగింది. కొంతకాలం రాష్ట్రంలో అధ్యాపక వృత్తిలో కొనసాగిన త్రిపుర అగర్తలాలో 1960లో ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా చేరి, అక్కడే ప్రిన్సి పాల్‌గా రిటైరయ్యారు.

ఆయన రాసింది 15 కథలే అయినా అవి 15 ఉద్గ్రంథాలతో సమానం. వాటిలోని ఒక్కొక్క వాక్యం అనేక పేజీల విస్తృతిని ఇముడ్చుకున్న సంక్షిప్తీకరించిన విత్తనమే. 'త్రిపుర'కి పాఠకులు తక్కువే గాని, భక్తులు ఎక్కువ. బహుశా తెలుగు రచయితలలో చలం తర్వాత భక్తులను కలిగిన రెండవ రచయిత 'త్రిపురే'.

జిడ్డు కృష్ణమూర్తి, మార్క్సిజం నుంచి జెన్ బుద్ధిజం వరకూ వివిధ రచనలపై ప్రభావితుడైన 'త్రిపుర' రచించిన కథలు 'త్రిపుర కథలు' పేరుతో పుస్తక రూపంలో వచ్చాయి. 'సెగ్మెంట్స్' (1975), 'బాధలు–సందర్భాలూ' కవితలు (1990) 'త్రిపుర కాఫ్కా కవితలు' ఆయన ఇతర రచనలు.

85 సంవత్సరాల త్రిపుర మే – 24న విశాఖ పట్నంలో మరణించారు.

అని "ఒక వుల్లి దోసె పత్రా మణీ మా బ్రదర్‌కి" అన్నాడు.

* * *

"క్రాఫర్డ్ దొరని పట్టి మెల్లగా తోసేసేను నా ఎల్డెస్ట్‌సన్‌ని కంట్రోలర్‌గా. ఆ కాలం వేరు. ఇంగ్లీషు వాళ్ళ తరహాయే వేరు. 'వాటీస్ యువర్ బాయ్ డూయింగ్, మేన్'' అని అడిగాడు.

"హి యీస్ మెట్రిక్ సార్" అన్నాను.

'వై డోంట్ యు పుష్ హిమ్ యిన్ టూ అవర్ బ్లడీ రైల్వేస్ మేన్' అన్నాడు.

మర్నాడే ఆర్డరూ. రెండోవాడిది పెద్ద బుర్ర లే. ఎమ్మెస్సీ చేసి ఎటామిక్ ఎనర్జీ కమీషన్‌లో ఉన్నాడు. బొంబాయి. థర్డ్ ఫెలోనే కొంచెం అల్లరి పెడుతున్నాడోయ్. వెధవ... కమ్యూనిష్టు లతో చేరి జండాలూ అవీ పట్టుకు తిరుగుతాడు. పొడుస్తాం, నరుకుతాం అని ఏమిటో పాట లూ... అవేమీ ఒద్దులే. వుత్త కాఫీ చాలు. అర గవు. ఆ తిండే పడిపోయింది."

* * *

నములుతున్న ముఖాలు.

గానుగలాగే.

ఎద్దుల్లా

మెల్లగా...

"ఇమేజ్ దొరకడం లేదు. ఫీలింగ్‌కీ థాట్‌కీ డిసోసియేషన్ అవడం లేదు. ఇవాళ పొయెటిక్ వెదర్ లేదు" అనుకున్నాడు భాస్కర్రావ్ ఖాళీ కాఫీ కప్‌లో సిగరెట్ ఏష్ దులుపుతూ.

* * *

"శివాజీగాడు ఛాన్సు ఇవ్వడం లేదురా ఎబ్డెన్ టోర్నమెంటులో. ముప్పయి నాలుగు కొట్టేను పచ్చయ్యప్పాస్ మీద. టాప్ స్కోర్. యూనివర్సిటీ మీద త్రీ ఫర్ ఫార్టీ సెవనూ. ఆల్‌రౌండర్లక్ఖర్లేకపోతే పొమ్మను. రేపు రాన్‌జీకి సెలక్టయితే గీర అణిగిపోతుందిలే."

* * *

"ఆరు నెల్లయి తిరుగుతున్నాను కాళ్ళరిగే లాగ ఈ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌ఛేంజ్ చుట్టూ. రిన్యూ చేయించుకోవడమేగాని ఇంటర్వ్యూకైనా పిలిచిన గాడ్దెవడూ కనిపించడం లేదు. ఒక్క సారి కాబోలు పిలిచేరు. షిప్‌యార్డ్‌కి. ఒఖ్ఖ క్వశ్చ న్‌కి జవాబు చెప్పలేకపోయానంటే నమ్ము. అసలు మొట్టమొదటే, ఇంగ్లీషులో నీ పేరేమిటని అడిగితే వాడేమిటన్నాడో బోధపడక తికమక పడిపోయాననుకో... రిక్షా డబ్బులు దండగ."

* * *

"మా పాప్ అంతేరా. లాస్ట్ ఇయర్ సమ్మర్ లో ఆలిండియా ఎక్స్‌కర్షన్ వెళ్ళాలీ, సిక్స్ హండ్రడ్ వైరు చెయ్యమని వైరిస్తే 'రిటర్న్ ఇమీడి యట్లీ" అని కొట్టేడు. ఆ మాత్రం కామన్‌సెన్సుం డొద్దూ."

"సరేగాని, ఈ టెరిలీన్ పేంట్ చూశావా. ఆరు లూప్‌లు పెట్టమని ఖచ్చితంగా చెప్తే నాలుగే పెట్టి కూచున్నాడు సన్నాసిగాడు. మళ్ళీ మాస్టర్ కట్టర్ అని పెద్ద బోర్డూ వీడూనూ."

* * *

టర్నిప్‌లా వున్న, టొమాటో ముఖం దిబ్బ బ్బాయి. ఇడ్లీల ప్లేటు పక్కకినెట్టి, ఒరిగిన తిమింగలంలాగ ప్లేటుమీద పడివున్న మసాల దోసెని చిత్రవధ చెయ్యడం మొదలుపెట్టేడు.

* * *

"ఇవాళ మాటినీ ఏమిట్రా"

"బర్ట్ లంకాస్టర్, సోఫియా లోరెన్. టైటిల్

జ్ఞాపకం లేదు."

"కమాన్, లెటజ్ గో."

"రైతో, బాస్."

*　　　*　　　*

"మూడు కేచ్‌లు మిస్సయ్యేడు. మళ్లీ పెద్ద కబుర్లు."

"తాసిల్దారు దగ్గరకి వెళ్ళడమంటేనే పెద్ద ఎడ్వెంచరూ వెధవకి."

"మావాడూ రైల్వేలోనే. కాని ఫిట్టరు. రెండోవాడు కూడా. కాని వాడు ఖరగ్‌పూర్‌లో."

"ఇల్లు దొరక్క సస్తున్నామనుకోండి."

"లెప్పర్సూ, బెగ్గర్సూ."

"డీసెంట్ జాబ్‌లురా. క్వార్టర్సూ, ఫ్రిజ్, ఓ."

"కెరూఏ 'ఆన్ ది రోడ్' చదివేరా?"

"లంచాలు మీద లంచాలు గుంజి, అఫీసనల్ కాల్నీలో ఇల్లు కట్టించేసేడంట."

*　　　*　　　*

"రాత్రికి రాత్రి మోసుకొచ్చేమండి టేక్సీలో చిట్టివలస నుంచి. అప్పటికప్పుడు ఆపరేషన్ చేశారు. కాని... కాని ఆశలేదు."

"పప్ఫాస్. పెద్ద డాబులూ నువ్వున్నూ."

"ఒరే ఇందులో రేలంగున్నాడూ."

*　　　*　　　*

మాంచి సారమైన నేలలో పెరిగిన బీట్ రూట్‌లా ఉన్న దిబ్బ కుర్రాడు దోసెని తినీసి, అప్పుడే సర్వర్ టేబుల్ మీద పెట్టిన పెసరట్‌ని ముదిరిన బెండకాయల్లాంటి వేళ్ళతో ఆప్యా యంగా నిమురుతున్నాడు. మేకని నరకబోయే కసాయివాడిలా –

*　　　*　　　*

సరోజినమ్మ గారికి కావలసిన దోసెల కోసం వచ్చిన రాములు చుట్టూ ఖాళీ కళ్ళతో చూస్తూంది. ఇంట్లో తన గుడిసెలో చిన్న కొడుకు సింవాచలంకి మందెవరు తెస్తారు...

*　　　*　　　*

మెత్తగా నల్లగా చుంచులాంటి ముఖాలు. రహస్యంగా నక్కలాంటి ముఖాలు. అప్పుడే చంపిన గేదెని చీరుతున్న పులిముఖాలు. దుమ్మలగుండు ముఖాలు. బెదిరిన కుందేలు ముఖాలు. సన్నగా పగగా పాము ముఖాలు. మార్కోవిచ్ సిగరెట్ పాకెట్ మీద ముఖంలాంటి ముఖాలు. డిటెక్టివ్ ముఖాలు, దొంగ ముఖాలు.

*　　　*　　　*

ఉదయం తొమ్మిదీ నలభయి. పైన చితచిత గా వాన. లోపల తడి, ఉక్క. ●

An online store for Indian eBooks

www.kinige.com

ఇప్పుడు కథాకేళి ఇ-బుక్స్ కూడా లభ్యం